క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పరీక్షలు మెరుగ్గా రాయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ ఎచ్చెర్ల నియోజక వర్గం కన్వీనర్ నేతలు అప్పారావు ఆకాంక్షించారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవ త్సరం విద్యార్థులకు పరీక్ష సామగ్రితో ఉన్న కిట్లను శుక్రవారం అందజేశారు. ఏఎంఐ నాయకులు సుంకు రమణ, పురుషోత్తం, రాంబాబు, మహేష్ ఉన్నారు.

పీహెచ్‌సీ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

జి.సిగడాం:స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి బొడ్డేపల్లి మీనాక్షి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సకాలంలో రోగులకు వైద్యసేవలు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల నిర్వహించిన డాక్టర్ బుడుమూరు యశ్వంత్, సుమబిందు పనితీరుపై సంతృప్తి చెందారు. సీహెచ్‌వో శివప్రసాద్, సూపర్‌వైజర్ భాస్కరరావు ఉన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ యశ్వంత్

జి.సిగడాం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక వైద్యాధికారి బి.యశ్వంత్ కోరారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల మూడో తేదీన ప్రతి గ్రామంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పని సరిగా చుక్కల మందును వేయాలన్నారు. సమావేశంలో వైద్యులు సుమబిందు, సీహెచ్ శివ ప్రసాదరావు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌ఎస్‌సీలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: అనారోగ్యంతో బాధపడుతున్న వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం భగీరథపురంలోని స్వగృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అలాగే శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాడుగుల మురళీధర్‌బాబా అల్లుడు సాంబమూర్తిని కూడా పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

సంతోషిమాతకు పూజలు



శ్రీకాకుళం కల్చరల్ : పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో మాఘమాస శుక్ర వారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు నమక చమక సహిత పంచ సూక్తాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో కుంకుమ పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారిని సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు.

బీజేపీ నాయకుల నిరసన

శ్రీకాకుళం న్యూకాలనీ: సందేశ్‌ఖలీ ఘటనపై బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ సర్కిల్‌లో సందేశ్‌ఖలీ ఘటనకు నిరసనగా బీజేపీ నాయకులు, మానవహారం నిర్వహించారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడిన షేక్ షాజహాన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ శ్రేణులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర ప్రముఖ్ పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్వేతగిరి.. సుందర రహదారి

- రూ.22 లక్షలతో పనుల నిర్వహణ
- తీరిన ప్రయాణ కష్టాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు, వాహనచోదకులు





నేడు: శ్వేతగిరి రింగ్‌రోడ్డు



నాడు: గ్రావెల్ రోడ్డులా మారిన దృశ్యం(ఫైల్)

గార: జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రమైన శ్వేతగిరి (శాలిహుండం కొండ) చుట్టూ ఉన్న బీటీ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. గార- చింతాడ రోడ్డులోని పూసర్లపాడు జంక్షన్ నుంచి శాలిహుండం గ్రామం మీదుగా మరలా గార రోడ్డు వరకు ఉన్న ఈ బీటీ రహదారి గతంలో గుంతలమయంగా ఉండేది. కొన్ని చోట్ల గ్రావెల్ రోడ్డులా తయారయ్యింది. గత ప్రభుత్వంలో ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. శాలిహుండం గ్రామస్తులతో పాటు కొండపైకి వచ్చే భక్తులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి వెళ్లే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రైతులు ఈ రోడ్డు పైనే రాకపోకలు సాగించేవారు. పూసర్లపాడు రైతు భరోసా కేంద్రం ఈ రహదారిలోనే ఉంది. రోడ్డు పాడైపోవడంతో ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకువెళ్లగా అంచనాలు రూపొందించి నిధులు విడుదల చేశారు. రూ. 22 లక్షలతో పనులు ప్రారంభించి 15 రోజుల్లో కొత్త లేయర్ వేసి సుందరంగా తీర్చిదిద్దారు. శాలిహుండం జాతరకే రోడ్డు పూర్తవ్వడంతో భక్తులతో పాటు శాలిహుండం పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి



తోటపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టార్ అధికారి పీవీఎస్ రామ్మోహన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికలకు సన్నద్ధం నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో మొత్తం 309 పోలింగ్ కేంద్రాలుండగా.. వీటిలో ఎచ్చెర్లలో 90, రణస్థలంలో 87, లావేరులో 69, జి.సిగడాంలో 63 కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం 2,42,637 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వరకు సైతం కొత్త ఓటర్లు చేర్పు, మృతి చెందిన వారిని జాబితా నుంచి తొలగింపు వంటి ప్రక్రియలు సాగుతున్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఎన్నికలు సంఘం ఆదేశించింది. సౌకర్యాలు లేని కేంద్రాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితా అందజేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులు నియోజకవర్గంలో 37 మంది సెక్టార్ అధికారులను నియమించారు. ఒక్కో సెక్టార్ అధికారికి ఏడు నుంచి 11 పోలింగ్ కేంద్రాలు పర్యవేక్షణ అప్పగించి, క్షేత్రస్థాయి పరిస్థితిపై నివేదిక కోరారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, రన్నింగ్ నీటి సౌకర్యంతో మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం, ఇంటర్నెట్ సౌకర్యం వంటి వాటిని పరిగణలోకి తీసుకుంటున్నారు. నివేదిక ఆధారంగా ముందుగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పనకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకోనుంది. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు నివేదికను ఉన్నత అధికారులకు సెక్టార్ అధికారులు అందజేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల భద్రత, ఓటర్ల అవసరాలకు తగ్గ ఏర్పాట్లుపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న ఆర్డీవో రంగయ్య

జి.సిగడాం: రానున్న ఎన్నికల్లో అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి నివేదికలు అందించాలని శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ అధికారి అంకిత భావంతో పని చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయలపై ఆరా తీయాలన్నారు. ఏవ్వరైనా విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, సర్వేయర్ బెహరా చిరంజీవ్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్రస్థాయికి నారువ సైన్స్ ప్రాజెక్టు



ఆర్జేడీ జ్యోతికుమారి నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థినులు

రణస్థలం: మండలంలోని నారువ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు నిద్రబంగి హిమబిందు, గిన్ని గోవిందమ్మ, చిల్లా స్వాతిలు ఆవిష్కరించించిన సైన్సు ప్రాజెక్టు జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మంచాల భాస్కరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈఎండీపీ ఎక్స్‌పో-2024 జిల్లా స్థాయిలో పోటీలు జరిగాయి. నారువ సైన్సు ఉపాధ్యాయుడు ఎం.ఎం.కృష్ణమూర్తి సూచనల ప్రకారం ముగ్గురు విద్యార్థినులు వ్యర్థాల నుంచి సంపద సృష్టించడం ఎలా అనే అంశం ఎన్నుకున్నారు. కొబ్బరి బొండాల నుంచి వచ్చే ఫైబర్, క్వాయిర్‌లతో వివిధ గృహోపకరణాల వస్తువుల తయారీపై ప్రాజెక్టు రూపొందించినట్టు వివరించారు. తక్కువ ఖర్చుతో గృహోపకరణాల తయారీ, ఎకో ఫ్రెండ్లీ ప్రాజెక్టు పరంగా జిల్లాలో ద్వితీయ స్థానం సంపాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విజయవాడలో ఈ నెల ఆరో తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి ఏఎండీపీ ఎక్స్‌పో-2024 విద్యార్థులు పాల్గొంటారన్నారు. ద్వితీయ బహుమతిని ఆర్జేడి మణిపాత్రుని జ్యోతి కుమారి చేతుల మీదుగా విద్యార్థినులు అందుకున్నట్టు చెప్పారు.

కొయ్యాం హైస్కూల్‌కు బెస్ట్ సైన్స్ ల్యాబ్ అవార్డు



ఆర్‌జేడీ జ్యోతికుమారి నుంచి బహుమతి అందుకుంటున్న దయానందకుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం హైస్కూల్‌కు బెస్ట్ సైన్స్ లాబ్ అవార్డును శ్రీకాకుళం పట్టణానికి చెందిన డీబీఆర్‌జీ ప్రసూనాంబ మెమోరియల్ ట్రస్ట్ ప్రకటించింది. ఈ మేరకు పాఠశాలకు రూ. 10 వేలు నగదు బహుమతి అందజేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం హెచ్‌ఎం దయానందకుమార్, సైన్స్ స్కూల్ అసిస్టెంట్ బి.లక్ష్మీనారాయణలకు నగదు బహుమతి పాఠశాల విద్య ఆర్‌జేడీ జ్యోతి కుమారి, డీఈవో వెంకటే శ్వరరావు అందజేశారు. పాఠశాల ల్యాబ్ అభివృద్ధికి ఈ నిధులు ఖర్చుచేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జి.సిగడాం: బాలికలకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న ఎస్‌వో ఉషారత్నకుమారి



రణస్థలంలో పరీక్షకు హాజరైన కేజీబీవీ విద్యార్థినులు

రణస్థలం: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కౌముది, శాంతినికేతన్ కళాశాలల కేంద్రాల్లో 745 మంది విద్యార్థులకు 63 మంది గైర్హాజరయ్యారు.

జి.సిగడాం: మండలంలోని పలు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక కేజీబీవీలో ప్రత్యేక అధికారి ఉషారత్నకుమారి బాలికలకు పలు సూచనలు చేశారు. పరీక్షలను బాగా రాయాలని ఆకాంక్షించారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. పోలీసులు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

సేవలే గుర్తింపునిస్తాయి



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగంలో చేరిన ప్రతి వ్యక్తికి ఉద్యోగ విరమణ సహజమని, విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.రావు (సుమన్) అధ్యక్షతన శుక్రవారం జనవరి, ఫిబ్రవరిలలో ఉద్యోగ విరమణ చేసిన తత్ర రామారావు, వీరన్న, వి.రామారావు, పి.ఇ.రావు, ఐ.ఎస్.రావు, కె.ఎం.ఏ.రావు, డి.ఏ.నారాయణ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎస్.అప్పారావు, ఎస్.ఎస్.ఆర్.శర్మ, కొర్లాం గణేష్, ఎం.పెంటయ్య, జామి ప్రసాద్, జె.సత్తిరాజు, ఎస్.ఆర్.పి.రావు, ఎస్.సత్యం, ప్రభాకర్, డి.ఎ స్.నారాయణ, పి.వి.రావు, బాజీ పాల్గొన్నారు.

బైపాస్ కూడలి వద్ద వాహనాల తనిఖీ

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకొని కుశాలపురం బైపాస్ కూడలిలో ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో భాగంగా వాహన తనిఖీలు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

8న శత రుద్రీయం



ఏర్పాట్లపై చర్చిస్తున్న సత్యసాయి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శివరాత్రి సందర్భంగా ఈ నెల 8న అరసవల్లి సత్యసాయి మందిరం శాంతి క్షేత్రంలో శత రుద్రీయం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు తెలిపారు. శుక్రవారం పలు మందిరాల కన్వీనర్లతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 45 మంది ఋత్వికులచే మహా లింగానికి 11 సార్లు మహా రుద్రాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అరసవల్లి మందిర కన్వీనర్ ప్రసాద్, పి.నాగేశ్వరరావు, పెద్దమందిరం కన్వీనర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విద్యారంగ సమస్యలపై పోరాటాలతో పాటు విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు ఎస్ఎఫ్ఐ ఎంతగానో కృషి చేస్తోందని సంఘ జిల్లా అధ్యక్షుడు డి.చందు అన్నారు. ఇటీవల 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు ప్రజ్ఞ వికాస్ పరీక్షలు నిర్వహించారు. అందులో జి.భువనేష్, వి.సాయిచంద్రరాజు, కె.ప్రేమ్‌కుమార్ విజేతలుగా నిలవడంతో శుక్రవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు టి.తిరుపతిరావు, కన్వీనర్ రేవతి, కమిటీ సభ్యులు వంశీ, నితిన్, మహేష్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరాలయంలోశివరాత్రికి ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సుంకరి కృష్ణ, ఈఓ సుకన్య తెలిపారు. శుక్రవారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా షామియానాలు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేసి మజ్జిగ, తాగునీరు, ప్రసాదం అందజేయాలని నిర్ణయించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు, వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో అత్యవసర వైద్యశిబిరం, నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాట్లుపై చర్చించారు. సత్యసాయి స్వచ్ఛంద సంస్థల సేవల వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

31లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నెల 31లోగా ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించినవారికి వడ్డీ మాఫీ ఉంటుందని కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్ఐలు ఉమామహేశ్వరరావు, నరేష్, వార్డు ఎమినిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్నులు చెల్లించడంలో జాప్యం చేయరాదన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు వసూలు చేయాలని సూచించారు. సకాలంలో పన్నులు చెల్లించనివారు అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ముందస్తుగానే పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగులకు అండగా సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: విశ్రాంత ఉద్యోగులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఎచ్చెర్ల నియోజకవర్గస్థాయిలో విశ్రాంత ఉద్యోగులతో ఆత్మీయ కలయిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాంత్ర ఉద్యోగులకు రావాల్సిన పింఛన్, ఇతర రాయితీలు సకాలంలో అందేలా సీఎం జగన్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్య పరంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పతుల్లో ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య బీమా రూపంలో మెరుగైన చికిత్స అందిస్తున్నారని గుర్తు చేశారు. విశ్రాంత ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగులకు కమ్యూనిటీ భవనం, ఇంకేమైన సమస్యలుంటే ప్రభుత్వ దృషిలో పెడతామని చెప్పారు. నాలుగు మండలాల నుంచి విచ్చేసిన విశ్రాంత ఉద్యోగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. నాలుగు మండలాల విశ్రాంత ఉద్యోగులు హాజరయ్యారు.

కొనసాగుతున్న ఏపీ టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: గత నెల 27వ తేదీన ప్రారంభమైన ఏపీ టెట్-2024 పరీక్ష కొనసాగుతుంది. రెండు కేంద్రాల్లో శుక్రవారం పరీక్ష రెండు షిప్టుల్లో జరిగింది. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిప్టులో వందమందికి 95, రెండో షిఫ్టులో వందకి 87 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిప్టులో 99కి 88, రెండో షిఫ్టులో వందకి 92 మంది హాజరయ్యారు. మొత్తం 399 మందికి 362 మంది హాజరయ్యారు. కాగా ఇప్పటి వరకు 1599 మందికి 1455 మంది హాజరయ్యారు. విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రణస్థలం: కొండములగాంలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉంటుందన్నారు. ఈ సదావకాశాన్ని ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ నెల 3న శ్రీకాకుళం పాతబస్టాండ్‌లోని మెడిసిన్ బ్యాంకు వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు, చర్మవ్యాధుల నిపుణులు, మధుమేహ వ్యాధి నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.